క్లుప్తంగా

షెడ్డును తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్, సర్పంచ్

గుడిపాల: అక్రమంగా ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిలో పశువుల షెడ్డును నిర్మించుకున్నాడని, దాన్ని తొలగించి కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అనుమతించాలని కొత్తపల్లె సర్పంచ్ పెరిల్లా, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ, 189కొత్తపల్లెకు చెందిన రమేష్ చేతిపంపు వద్ద పశువుల షెడ్డును ప్రభుత్వ స్థలంలోనే నిర్మించుకున్నాడని దాన్ని తొలగించమని కోరినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కమ్యూనిటీ భవనం మంజూరు చేసిందని, దాని కోసం ఆ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు. వారితోపాటు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 1 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతంగా నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. ఈ శిబిరాల నిర్వహణపై శుక్రవారం కమిషనర్ ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ, వేసవిలో సెలవులు, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు, యువత, మహిళల కోసం ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు నిర్దేశించిన కోర్సుల్లో ఉత్తమ శిక్షణ అందించాలని ఆదేశించారు. శిక్షణ కోసం ఇప్పటికే 600 మంది రిజిస్టర్ చేసుకున్నారని, శిక్షణ వివరాలను వీరికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం గోపి, కోర్సుల నిర్వాహకులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్ సేవలను వినియోగించండి



శిక్షణ ఇస్తున్న ఏపీఎం నాగరత్న

పూతలపట్టు: మండలంలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలను క్రోడీకరించేలా రూపొందించిన లోకోస్ యాప్‌ను ద్వారా సంఘమిత్రలు వినియోగించుకోవాలని ఏపీఎం నాగరత్న అన్నారు. డిజిటలైజేషన్ ద్వారా భవిష్యత్తులో చాలా ప్రయోజనాలు ఉంటాయని తెలియజేశారు. మండల, గ్రామ స్థాయి సీసీలు, సంఘమిత్రాలు దీనిపై సమగ్ర అవగాహన కలిగిఉండాలని తెలియజేశారు.

ఆ సత్రం మా పూర్వీకులది

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని శ్రీపురం వెంకట్రాయశెట్టి సత్రం మాపూర్వీకులదని సర్వహక్కులు మాకే ఉన్నాయని నగరానికి చెందిన సునీల్‌రాజ్ తెలిపారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంకట్రాయశెట్టి సత్రంపై కోర్టులో కేసు నడుస్తోందన్నారు. అయితే దేవదాయశాఖ అధికారులు వేలం పాట నిర్వహించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. ఆ పాటను రద్దు చేయాలని కోరారు.

సంపూర్ణ శతావధానం ఆరంభం

చిత్తూరు రూరల్: హరివిల్లు లలిత కళావేదిక, శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సంపూర్ణ శతావధానం కార్యక్రమం చిత్తూరులోని పీవీకేఎన్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైంది. వివిధ వర్ణనల పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు శతావధాని ఆముదాల మురళి దీటుగా సమాధానమిచ్చారు. తెలుగు సాహితీ ప్రక్రియలు, వివిధ విశేషణాలపై అవధాని వివరణలిచ్చారు. మరో రెండు రోజులపాటు శని, ఆదివారాల్లోనూ అవధానం జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఆనందరెడ్డి, పార్థసారథినాయుడు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

బంగారుపాళెం: మండల కేంద్రంలోని పశువైద్యశాల ఆవరణలో శుక్రవారం పాడి పోషణపై ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ విజయమోహన్ పాడిపశువుల పోషణ, దూడలు, గొర్రెలు, పెరటి కోళ్ల పెంపకం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు అమరనాథ్, మోహన్‌బాబు, ఝాన్సీ, రైతు నాయకులు కృష్ణమూర్తి, ప్రవీణ్‌రెడ్డి, బంగారుపాళెం, యాదమరి మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు

యాదమరి: మండల కేంద్రంలో కొలువైన తిరుపతి గంగమ్మ జాతరకు ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నారు. మే 2, 3 తేదీల్లో నిర్వహించే గంగమ్మ జాతరకు ఆలయం వద్ద, మెయిన్ బజారులో అమ్మవారి విద్యుత్ దీపాలకు కటౌట్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం నుంచే జాతర సందడి మొదలుకానుంది.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం రాములు గుడి వీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

మ్యుటేషన్ దందాపై స్పందన

రెవెన్యూ విభాగంలో అవినీతి ఏ స్థాయిలో నాటుకుపోయిందో అందరికీ తెలిసిన విషయమే. అయితే అది గుడిపాల మండలంలో మితిమీరిపోయింది. వీఆర్వోల ఆగడాలతో విసిగిపోయిన రైతులు అప్పులు చేసి లంచాలు ఇచ్చుకోక తప్పడం లేదు. మండలాధికారులు మాత్రం తమకు సంబంధం లేదంటూ ప్రకటనలు ఇస్తూ, మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. లోలోన మాత్రం వారికి అందాల్సిన వాటాలు అందుతుండడంతో వీఆర్వోలు చెలరేగిపోతున్నారు. పైగా ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలో కూడా రైతులకే నేరుగా వీఆర్వోలు చెబుతున్నారు. ఇదే విషయం శుక్రవారం సాక్షిలో ప్రచురితం కావడంతో బాధితులందరూ విలేకరికి ఫోన్లు చేయడం మొదలెట్టారు. కొందరు తమ పేర్లు బయట పెట్టొద్దని చెప్పగా, మరి కొందరు మాత్రం ''వీఆర్వోలు బరితెగించారు. ఈ విషయం అధికారులకు తెలిసినా నోరు మెదపడం లేదు. వీళ్ల అరాచకాలు భరించడం కంటే చచ్చిపోవడమే నయం.'' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

- వీఆర్వోలతో ఉదయం డిప్యూటీ తహసీల్దార్ సమావేశం
- మధ్యాహ్నం తహసీల్దార్ సమీక్ష
- వీఆర్వోలకు హెచ్చరికలు
- రైతులు ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

గుడిపాల: 'మ్యుటేషన్ పేరిట దందా' అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఉదయం 11గంటలకు డెప్యూటీ తహసీల్దార్ కల్యాణి, వీఆర్వోలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్ ఫైళ్ల పెండింగ్‌పై ఆరా తీశారు. రెవెన్యూ గ్రామాల వారీగా వీఆర్వోలు మ్యుటేషన్‌లు ఎందుకు పెండింగ్‌లో ఉంచారని ప్రశ్నల వర్షం కురిపించారు. సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలని ఆదేశించారు. ఇకపై మ్యుటేషన్‌కు సంబంధించి రైతుల వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఫిర్యాదులు వస్తే సరెండర్ చేస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. 17 సచివాలయాలకు సంబంధించి 13 మంది వీఆర్‌ఓలు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీల వారీగా ఒక్కో వీఆర్వోతో ఆయన మాట్లాడుతూ రూ.5వేల నుంచి రూ.8వేల వరకు లంచం తీసుకుంటున్నట్లు సాక్షిలో ప్రచురితమైందని చెప్పారు. రైతులు ఎవరైనా ఫిర్యాదుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోల వద్ద దరఖాస్తులు ఇచ్చి వాటిలో సంతకం చేయిస్తేనే సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో పెడుతున్నారని లేకుంటే పెట్టడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ఇలాంటి ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యుటేషన్ ఫైళ్లను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని హుకుం జారీ చేశారు.

వీఆర్వోల దందాకు సాక్ష్యాలు ఇవే

మ్యుటేషన్ పేరిట దందా అన్న వార్తపై 'సాక్షి'కి పదుల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. గురువారం పలు గ్రామాల నుంచి రైతులు ఫోన్ చేశారు. నేరుగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఫిర్యాదు చేస్తామన్నారు.

రెండేళ్లుగా తిప్పిస్తున్నాడు



నాభర్త రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మాకు 70 సెంట్లు భూమి ఉన్నది. నాపేరు మీద మార్చమని చెబుతుంటే ఆప్షన్ రాలేదంటూ కాలయాపన చేస్తున్నాడు. ఎందుకు చెయ్యలేదని నిలదీస్తే రూ.3వేలు ఇవ్వాలని తెగేసి చెప్పాడు. డబ్బులేక గొమ్మునుండి పోయాను. ఈ లంచగొండి వీఆర్‌ఓ వలన రెండేళ్లుగా రైతు భరోసా సొమ్ము రూ.27వేలు కోల్పోయాను.

– జయమ్మ, డిబిపల్లె, గుడిపాల

పాస్‌బుక్ కోసం రూ.3 వేలు ఇచ్చా..



నా భర్త నీలకంఠారెడ్డి మృతి చెందగా నాభర్త పైన ఉన్న భూమిని నాపైన మార్చేందుకు ఈ వీఆర్వో రూ.3వేలు తీసుకున్నారు. నా కూతురుపై మరో పాస్‌బుక్ చేయడానికి రూ.4వేలు అడుగుతున్నారు. నా దగ్గర అంతలేదని చెప్పడంతో ఆరు నెలలుగా చెబుతూ వీఆర్వో తిప్పిస్తున్నాడు. పాస్ బుక్ చేసివ్వ అంతలోపు ఇస్తానని చెప్పా. అట్లా చెబితే మా సార్లు ఒప్పుకోరు అని చెబుతున్నాడు.

– అండాలమ్మ, మరకాలకుప్పం

నగరంలో పక్కాగా పారిశుద్ధ్య పనులు

చిత్తూరు అర్బన్: క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలోని 32వ సచివాలయం పరిధిలో శుక్రవారం ఉదయం కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ప్రధానంగా మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రోజువారీ కార్యక్రమాల తీరును పరిశీలించారు. స్థానికంగా మురుగునీటి కాలువలు నిర్మాణం, కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం నగరపాలక సంస్థ చెత్త తరలింపు వాహనం లాగ్ బుక్, ట్రిప్ షీట్‌ను తనిఖీ చేశారు. చెత్త సేకరణ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పూర్ణచంద్రరావు, ఎంహెచ్వో డా.లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, ఇతర అధికారులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల పరిశీలన

నగరంలో గాంధీ విగ్రహం కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న హైమాస్ట్ లైట్ పనులను శుక్రవారం కమిషనర్ అరుణ పరిశీలించారు. నగరంలో విద్యుత్ దీపాల ఆధునీకరణలో భాగంగా, ప్రధాన ప్రాంతాల్లో అధిక వెలుగునిచ్చే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గాంధీ విగ్రహ కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



వార్షికోత్సవంలో ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పి.రెడ్డివారిపల్లెలో ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దీనికి హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు నాడు–నేడు పథకం ద్వారా మౌళిక వసతులు కల్పిస్తోందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ మండల కన్వీనర్ టిరిన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు భాస్కర్, సురేంద్రరెడ్డి, హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి

తవణంపల్లె: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల్లోపు విధిగా హాజరు వేయాలని చెప్పారు. యూనిఫాంతో విధులకు హాజరుకావాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు స్పెషల్ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చే చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్ : ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. పీసీఆర్ కూడలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే, మేయర్ అముద, కమిషనర్ అరుణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రయాణికులు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. కమిషనర్ జె అరుణ మాట్లాడుతూ, నగరంలోని కలెక్టరేట్, మురకంబట్టు, పీసీఆర్ కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి మిగిలిన ప్రాంతాల్లోనూ చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్వో డా.లోకేష్, డీఈలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు స్థలం కేటాయింపు

నగరంలోని పీసీఆర్ కళాశాల ప్రహరీ వద్ద వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్ణయం తీసుకుంది. నగర పాలక సంస్థ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె అరుణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, ఆర్ జి శ్రీకాంత్, సి.శోభ, బి. పూర్ణచంద్రరావు, ఎ.జి.సహదేవన్ హాజరయ్యారు. ఇందులో అజెండా, టేబుల్ అజెండా అంశాలపై చర్చించారు. పీసీఆర్ కళాశాల ప్రహరీ గోడ వద్ద లయన్స్ క్లబ్ ఏర్పాటు చేయనున్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు స్థలం కేటాయింపు, సాధారణ నిధుల ద్వారా పలు వార్డుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్ –2016 మేరకు కన్‌స్ట్రక్షన్ అండ్ డెమోలిషన్ ప్లాంట్ నిర్వహణను స్వయం సహాయక సంఘానికి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ ధనలక్ష్మీ, ఎంహెచ్వో డా.లోకేష్, ఏసీపీ రామకృష్ణుడు, అధికారులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ పథకాల పంట

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



కల్లూరుపల్లె దళితవాడలో సమస్యలను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు వివరిస్తున్న మహిళలు

బంగారుపాళెం: జగనన్న పాలనలో పేదల ఇంట పథకాల పంట పండుతోందని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కల్లూరుపల్లె, కొరివిపల్లె, దళితవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయనకు గ్రామంలో ఘన స్వాగతం పలికారు. నాయకులతో కలసి ఎమ్మెల్యే ఇంటికీకీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి ఒకొక్క కుటుంబానికి ఎంత మేరకు లబ్ధిచేకూర్చారన్న విషయాన్ని వివరించారు. దళితవాడకు కమ్యూనిటీ భవనం మంజూరు చేయాలని, సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి అమ్మఒడి, రైతు భరోసా వస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యాదీవెన, విద్యావసతి దీవెన పథకం కింద ఏటా నగదు బ్యాంకు ఖాతాలకు జమ అవుతోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలన్న లక్ష్యంతోనే సీఎం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కులమతాలు, పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ ధ్యేయమన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సోమశేఖర్, సర్పంచులు బాలాజీ, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు స్వాతి కమలాపతి రెడ్డి, హేమచంద్ర, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శులు శరత్‌రెడ్డి, దొరస్వామి, నాగరాజ, కమలాపతిరెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాయిరెడ్డి, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాటప్పగారిపల్లెలో

మండలంలోని కాటప్పగారిపల్లెలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన



పూతలపట్టు: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని పోటుకనుమ పంచాయతీలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల లబ్ధిదారుల అనుమతితో వారి ఇంటి తలుపులకు, మొబైల్ ఫోన్లకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సర్పంచ్ బాబునాయుడు, నిరంజన్‌రెడ్డి, ఎంఎస్‌మణి, బాలాజీ, షణ్ముగం, ప్రవీణ్, ఉమాపతి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



ఆర్ముగం (ఫైల్)

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం పాలూరు గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి కరెంట్ షాక్ తో మృతి చెందాడు. కుటుంబీకుల కథనం మేరకు, గ్రామానికి చెందిన రైతు ఆరుముగం (53) ఇంటికి సమీపంలో 11కేవీ లైన్ ఉంది. ఈ తీగలు బొప్పాయి చెట్టును తాకుతూ వెళ్లాయి. ఇదే మార్గంలో వెళ్లిన ఆర్ముగం షాక్‌కు గురయ్యాడు. కుటుంబీకులు, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మృతదేహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు త్యాగరాజులు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ దుర్మరణం



హరిత (ఫైల్)

తవణంపల్లె: మండలంలోని అరగొండ పంచాయతీ పైమాఘం ఆశావర్కర్ హరిత(45) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె రెండు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ, చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడే శుక్రవారం మృతి చెందారు. మండల వైద్యాధికారులు దాత్రేయచౌదరి, ప్రియాంక, మోహన్‌వేలు, వినయ్‌కుమార్, సీహెచ్‌ఓ వెంకటరమణతోపాటు వైద్య ఆరోగ్య సిబ్బంది హరిత భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతురాలి భర్త ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, వీరికి సంతానం లేదు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శ్యామ్ సుగుణ కుమారి తెలిపారు. చిత్తూరు అర్బన్, రూరల్, యాదమరి, గుడిపాల మండలాల పరిధిలో మొత్తం 12 ఖాళీలున్నాయన్నారు. ఇందులో ప్రధాన అంగన్‌వాడీ 03, మినీ 02, సహాయకుల పోస్టులు 07 ఖాళీలున్నాయన్నారు. ప్రధాన అంగన్‌వాడీ పోస్టులు చిత్తూరు నగరంలోని మంగసముద్రం, గుడిపాల మండలం బొమ్మసముద్రం, యాదమరి మండలం దాసరపల్లి, మినీ పోస్టులు చిత్తూరు మండలం తాళంబేడు ఎస్టీ కాలనీ, గుడిపాల మండలం బందార్లపల్లిలో ఖాళీలున్నాయన్నారు. సహాయక పోస్టులు నగరంలోని తిమ్మసాని పల్లి, శరవణ పురం–2, పాంచాలిపురం, గుడిపాలలోని పేయనపల్లి, నంగమంగళం, యాదమరిలోని మార్లబండ, పాచిగుంటలలో పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయన్నారు. మే 13వ తేదీలోపు చిత్తూరు ఐటీఐ సమీపంలోని సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బంగారుపాళెం: స్థానిక ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ వాణిశ్రీదేవి సూచించారు. బంగారుపాళెం ప్రాజెక్టు పరిధిలోని ఐరాల, తవణంపల్లె, బంగారుపాళెం మండలాల్లో మెయిన్ అంగన్‌వాడీ పోస్టు ఒకటి, మినీ అంగన్‌వాడీ పోస్టు ఒకటి, హెల్పర్ పోస్టులు 7 ఉన్నాయన్నారు. ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను మే 13వ తేదీలోపు సీడీపీవో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

విద్యార్థులకు డిక్షనరీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు డిక్షనరీలు అందజేసినట్లు ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్ తెలిపారు. నగరంలోని పీసీఆర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ సీఈసీలో నందిని 483, ఎంపీసీలో మానస 436, బైపీసీలో కిరణ్‌కుమార్ 391 మార్కులు సాధించారన్నారు. సెకండియర్ బైపీసీలో తేజస్విని 905, సీఈసీలో సత్యలక్ష్మి 884, ఆసన 856 మార్కులు సాధించారని తెలిపారు. వారికి డిక్షనరీలు అందజేసి అభినందించారు.



డిక్షనరీలు అందుకున్న విద్యార్థులు

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం



గుడిపాల: చింతగుంటూరులో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత.



తవణంపల్లె: విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వినయ్‌కుమార్

తవణంపల్లె: మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఎగువ వెంకటాపురంలో శుక్రవారం ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో గర్భవతులకు పరీక్షలు చేయించి తగు సూచనలు, సలహాలు అందించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎగువ వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం వేదవతి, ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చింతగుంటూరులో వైద్యసేవలు

గుడిపాల: మండలంలోని చింతగుంటూరులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి రష్మిత 60 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఏఎన్ఎం వనజ, ఎంఎల్‌హెచ్‌పి యమున, సిబ్బంది ఆశ, కోకిల, సుజాత పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారం

పూతలపట్టు: మండల పరిధిలోని ముత్తిరేవులలో దారి సమస్యను ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ విజయభాస్కర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ట్రైనీ కలెక్టర్ శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సేవల విధివిధానాలను తెలుసుకున్నారు. అనంతరం ముత్తిరేవుల దారి సమస్యను పరిష్కరించారు.



దారి సమస్యను పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి